ప్రజాశక్తి

ఆదివారం 19 అక్టోబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ప్రభుత్వ రంగమే ఆయువుపట్టు

సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై రాధాకృష్ణన్, సిహెచ్.నర్సింగరావు, మాల్యాద్రి

- నిర్వీర్యానికి మోడీ సర్కారు కుట్రలు
- రిజర్వేషన్లకు తూట్లు
- 'ప్రభుత్వ రంగం - సామాజిక న్యాయం' సదస్సులో వక్తలు
- ఐక్యపోరాటాలతో తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

'ప్రభుత్వరంగ సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడి. దేశ ఆయువుపట్టు. అవి బలంగా ఉండటం వల్లే దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు, వికలాంగులు, బడుగు, బలహీనవర్గాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. వాటిని నిర్వీర్యం చేసి కారుచౌకగా కార్పొరేట్లకు అప్పగించడానికి మోడీ సర్కారు కుట్రలు పన్నుతోంది' అని పలువురు వక్తలు అన్నారు. ఐక్య పోరాటాలతో పబ్లిక్ సెక్టార్‌ను ప్రజలంతా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు విశాఖలో డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4 వరకూ జరుగుతున్న నేపథ్యంలో సిఐటియు, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీల సంయుక్తాధ్వర్యాన 'ప్రభుత్వరంగం - సామాజిక న్యాయం' అన్న అంశంపై విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సదస్సు నిర్వహించారు. సిఐటియు 18వ జాతీయ మహాసభ ఆహ్వాన సంఘం కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ దీనికి అధ్యక్షత వహించారు. సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన సిపిఎం లోక్‌సభ పక్ష నేత, దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డిఎస్‌ఎంఎం) జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను బలహీన పరిచే చర్యలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విడనాడాలన్నారు. ఎపిలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని ఆయన అభినందించారు. కార్పొరేట్ సంస్థలకు రిజర్వేషన్లు, కార్మికుల ప్రయోజనాలు పట్టవన్నారు. దళిత్ శోషన్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు కంపెనీల పేరిట చేస్తున్న హడావుడిని వివరించారు. ఆయన ముఖ్యమంత్రి కాకమునుపే హైదరాబాద్ వంటి చోట్ల అనేక పరిశ్రమలు ఉన్నాయన్నారు. ప్రైవేట్ రంగం ప్రవేశించాక ప్రభుత్వ రంగానికి దెబ్బ పడిందన్నారు. గూగుల్, ఎయిర్‌టెల్, అదాని కలిసి రూ.22 వేల మిగతా 2లో..

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అనధికార మద్యంపై పటిష్ట నిఘా

మత్తు మందుల అమ్మకాలను పసిగట్టండి

అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రామ వార్డు సచివాలయ స్థాయిలో అనధికార మద్యం అమ్మకాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అక్రమ మద్యం అమ్మకాలు జరగకుండా గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, శానిటేషన్ సిబ్బంది ఎక్సైజ్ శాఖకు సహకరించి సమాచారం ఇవ్వాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జోనల్ కమిషనర్లతో కలెక్టర్ అక్రమ మద్యం అమ్మకాల గుర్తింపు, నిరోధంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పనిచేసే విఆర్‌ఒలు, విఆర్‌ఎలు వార్డులలో ఎక్కడ అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయో పసిగట్టి సమాచారం ఇవ్వాలన్నారు. అనధికార మద్యం అమ్మకాలను నిరోధించడానికి కింది స్థాయిలో గ్రామ వార్డు కార్యదర్శుల సహకారం తీసుకోవాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ పరిధిలో ఎలాంటి మాదక ద్రవ్యాలు అమ్మకం జరిగినా పసిగట్టాలన్నారు. స్థానికంగా మద్యం తయారీ, బయట ప్రాంతం నుండి తీసుకొచ్చి అమ్మడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. కల్తీ మద్యం వల్ల ప్రమాదాలు జరిగి చనిపోవడం వంటి ఘటనలు తలెత్తరాదన్నారు. లేబుల్ లేని బాటిళ్ల అమ్మకాలు జరగకుండా చూడాలన్నారు. ఇతర మాదక ద్రవ్యాలైన మిగతా 2లో..

గూగుల్... అంతా అడ్డగోల్ !

వార్త 2లో..

అదాని స్మార్ట్ మీటర్ల బిగింపు అడ్డగింత

వార్త 6లో..

తర్లువాడ దళితుల భూములు కాపాడాలని వినతి

వార్త 3లో..

సమ్మెలో పాల్గొన్న డ్రైవర్లు

సమ్మెలో అద్దెబస్సు డ్రైవర్లు

విశాఖలో నిలిచిన పలు సర్వీసులు

వార్త 2లో..

'డ్రెడ్జ్ గోదావరి' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో అగ్రగామిగా పేరొందిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డిసిఐ) విశాఖపట్నం పోర్టు అథారిటీ, పారాదీప్ పోర్టు అథారిటీ, దీనదయాళ్ పోర్ట్ అథారిటీ (కాండ్లా), జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీలతో కూడిన కన్సార్టియం ఆధ్వర్యంలో చరిత్ర సృష్టించింది. కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో నిర్మించబడిన తమ తాజా నౌక 'డ్రెడ్జ్ గోదావరి'ని ఘనంగా ఆవిష్కరించింది. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఛైర్మన్ డాక్టర్ అంగముత్తు కొచ్చిన్ పోర్టు ఛైర్మన్‌తో కలిసి డ్రెజ్జర్‌ను శనివారం కొచ్చిన్ షిప్ యార్డులో లాంఛనంగా ప్రారంభించారు. 'డ్రెడ్జ్ గోదావరి' ప్రపంచంలోనే తొలి 12000 ఘన మీటర్ల సామర్థ్యం కలిగిన బీగల్ సిరీస్ డ్రెడ్జర్. ఇది ప్రపంచ డ్రెడ్జింగ్ రంగంలో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. అత్యాధునిక సాంకేతికత దీని సొంతం. ఆధునిక ఇంజినీరింగ్ ప్రమాణాలతో రూపొందించబడిన ఈ నౌక అధిక సామర్థ్యం, కచ్చితత్వం, పర్యావరణహితమైనది. డ్రెడ్జ్ గోదావరి ప్రారంభోత్సవ వేడుకలో డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ డ్రెడ్జ్ గోదావరి భారత సముద్ర రంగానికే గర్వకారణమని కొనియాడారు. ప్రస్తుతం డిసిఐ దేశ వ్యాప్తంగా సుమారు 120 మిలియన్ ఘన మీటర్ల డ్రెడ్జింగ్ పనిలో 60 మిలియన్ ఘన మీటర్లను నిర్వహిస్తోందన్నారు. 'డ్రెడ్జ్ గోదావరి' చేరికతో ఈ సామర్థ్యం 80 మిలియన్ ఘన మీటర్లకు పెరగనుందని తెలిపారు.

డ్రెడ్జ్ గోదావరి నౌక వద్ద అంగముత్తు తదితరులు

నాతయ్యపాలెం / గంభీరం / దేశపాత్రునిపాలెం

శివకాశి అయ్యన్ బాణాసంచా షోరూమ్

శీలానగర్: NH-5, మార్బుల్ షాప్ ఎదురుగా, నాతయ్యపాలెం, BHPV పోస్ట్, విశాఖపట్నం

గంభీరం: పైడా కాలేజీ ఎదురుగా, శశి కాలేజ్ రోడ్, గంభీరం, విశాఖపట్నం

దేశపాత్రునిపాలెం: పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా

అయ్యన్ గ్రీన్ క్రాకర్స్ అమ్మబడును

AYYAN'S GREEN CRAKERS AVAILABLE

COMPANY FRESH ITEM ◆ GENUINE RATES

BUNNY BRAND FANCY FIREWORKS

SIVAKASI'S Ayyan's FIRE WORKS

For Rates Visit: www.vizagayyan.in

NH-5, Opp. Marble Shop, Natayyapalem, SHEELANAGAR, Vizag-12.

Opp. Pydah College, Sasi College Road, GAMBHIRAM, Vizag.

Paravada Mandalam, DESAPATRUNIPALEM, Anakapalli Dist.

గూగుల్...అంతా అడ్డగోల్ !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోనే కాదు రాష్ట్రంలో ఏ నోట విన్నా గూగుల్...గూగుల్...గూగుల్. ఈ ప్రచారం ఒక్క చదువుకున్న వారిలోనేగాక చదువులేని నిరక్షరాస్యుల మెదళ్లనూ తాకింది. గూగుల్‌పై జరుగుతోన్న ప్రచారంపై ప్రతిపక్షాలు, వామపక్షాలే కాదు స్వపక్ష కూటమికి చెందిన వారి నుంచీ విమర్శలు వినిపిస్తున్నాయి. అమలు సాధ్యమా ? ఎప్పటికవుతుంది ? ఏం జరుగబోతుంది ? అన్న అనుమానాల నుంచే ఈ విమర్శలు వస్తున్నాయి. గూగుల్‌పై జరుగుతున్న ప్రచార పటాటోపం అంతా ఇంతా కాదు. గూగుల్ వస్తే విశాఖ రూపురేఖలే మారిపోతాయంటూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులూ అదే పనిగా ఊదరగొడుతున్న సంగతి తెలిసిందే. ఈ తరహా ప్రచారం నిర్వహించడంలో చంద్రబాబు సర్కారుకు కొత్తేమీ కాదు. 2014లో అంటే రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం రాష్ట్ర రాజధాని అమరావతిపై పదేపదే ఇలాంటి మాటలు చెబుతూ ప్రపంచంలో ఎక్కడాలేని రాజధాని నిర్మిస్తా అంటూ గొప్పలకు పోయిన సంగతి తెలిసిందే. ప్రపంచంలో ఎక్కడా లేకపోతే ఇక్కడెలా ఉంటుందంటూ నెటిజన్లు ఆడుకోవడం తెలిసిందే.

గూగుల్ ఎక్కడ, ఎప్పుడు? ఎన్ని ఉద్యోగాలు ?

గూగుల్ డేటా సెంటర్ కోసం సుమారు 500 ఎకరాలను విశాఖ జిల్లాలో తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆనందపురం, అడవివరం, రాంబిల్లి వంటిచోట్ల ఈ స్థలాలను ప్రభుత్వం ఇవ్వజూపుతోంది. ఆనందపురం మండలం తర్లువాడ కొండ వద్ద 300 ఎకరాలను ఇప్పటికే సిద్ధం చేసేశారు. ఇక్కడ దళితులకు 40 ఏళ్ల కిందట ఇచ్చిన భూములను వెనక్కి తీసుకునే చర్యలు మొదలయ్యాయి. దీన్ని దళిత పేదలంతా వ్యతిరేకిస్తున్నారు. వీరికి సిపిఎం అండగా నిలబడింది. రూ.87 వేల కోట్లకుపైగా నిధులతో గూగుల్ సంస్థ ఇక్కడ ఏర్పాటు కాబోతోందని, రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల వరకూ రాయితీలు ఇస్తోందని

తాజాగా వెల్లడైంది. అయితే ఇన్ని వేల కోట్లరూపాయలు పెట్టాక ఎవరికి లాభం, ఉద్యోగాలెన్ని అన్న సంగతిపై ఇంతవరకూ ప్రభుత్వం అయితే స్పష్టత ఇవ్వలేకపోతుంది. తొలుత కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం 200 ఉద్యోగాలు వస్తాయని వెల్లడించింది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు మీటింగులోనూ తొలుత ఇదే తేల్చారు. విమర్శలు పెరిగే సరికి 1.90 లక్షలు ఉద్యోగాలంటూ మాటమార్చేశారు. ప్రపంచం మొత్తం మీద గూగుల్ తాలూకా డేటా సెంటర్లు, రీసెర్చి సెంటర్లలో కలిపితే 1.87 లక్షల మంది ఉన్నప్పుడు విశాఖ ఒక్కచోటే 1.90లక్షల ఉద్యోగాలెలా వస్తాయన్న ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విశాఖలో శనివారం పర్యటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల రాయితీలను గూగుల్‌కివ్వడం ఏమిటని ? ఈ డబ్బులు సగం వెచ్చించినా రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలు పూర్తవుతాయని చెప్పుకొచ్చారు. పర్యావరణ అంశాలపైనా ఆయన అనేక సందేహాలు వెలిబుచ్చారు. ప్రభుత్వం అడ్డగోలుగా ముందుకెళితే వ్యతిరేకత మూటగట్టుకోవడం ఖాయం. విశాఖకు గూగుల్ రాజకీయ ఆకర్షణ నినాదంగా కాకుండా ప్రజలకు, ఈ ప్రాంత నిరుద్యోగులకు ఏం మేలు చేయనుందో ప్రభుత్వం స్పష్టంగా తెలపాల్సి ఉంది.

మొదటి పేజీ తరువాయి..

ప్రభుత్వ రంగమే ఆయువుపట్టు

కోట్ల రాయితీలతో విశాఖలో గూగుల్ డేటా నెలకొల్పుతున్నారని తెలిపారు. ఉద్యోగాల పేరిట భ్రమలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. దేశ సంపదను ఉచితంగా వాడుకొని కార్పొరేట్లు వ్యాపారం చేసేలా ప్రభుత్వాలు ప్రణాళికలు చేస్తున్నాయన్నారు. కార్పొరేట్ కంపెనీల దగ్గర రూ.10 లక్షల కోట్ల నగదు పేరుకుపోయి ఉందని, ఇదంతా కార్మికుల శ్రమ సంపదేనని అన్నారు. ఎనిమిదేళ్ల జిఎస్‌టి భారాలు వేసి, ప్రజలను పీల్చి పిప్పిచేశారన్నారు. కొనేవారు తగ్గడంతో జిఎస్‌టి తగ్గించి కార్పొరేట్ కంపెనీల సరుకులు కొనేలా కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. దేశాభివృద్ధికి మోడీ, చంద్రబాబు, అదాని ఆటంకంగా తయారయ్యారన్నారు. ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం పూనుకుందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించనున్నామన్నారు. కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలను ముక్కలు ముక్కలుగా చేసి ప్రైవేటుకు అప్పగించే కుట్రలు చేస్తోందన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటుపరం చేయడం తప్ప మోడీ సర్కారు చేసిందేమీ లేదన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచారన్నారు. దళితులపై దాడులు, అత్యాచారాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం ప్రభుత్వ రంగం ద్వారానే సాధ్యమన్నారు. రాజ్యాంగాన్ని మార్చివేసి మనుధర్మాన్ని అమలు చేయడానికి కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. సదస్సులో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, కార్యదర్శి కె.ధనలక్ష్మి, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి, వై.రాజు, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సత్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : షిప్‌యార్డులోని సమస్యలపై సిపిఎం ఎంపీ రాధాకృష్ణన్‌కు షిప్‌యార్డ్ సిఐటియు నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. రాధాకృష్ణన్ 'ప్రభుత్వ రంగం - సామాజిక న్యాయం' సదస్సులో పాల్గొనేందుకు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రానికి విచ్చేశారు. ఆయన్ని షిప్‌యార్డు నాయకులు కలిసి సమస్యలను వివరించారు. వర్క్ ఆర్డర్లు, ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగుల పర్మినెంట్, స్టాఫ్ అండ్ వర్క్‌మ్యాన్ శాశ్వత పద్ధతిలో రిక్రూట్మెంట్ సమస్యలను ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులు బిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

అనధికార మద్యంపై పటిష్ట నిఘా

గంజాయిపైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గంజాయి చాక్లెట్ల అమ్మకాలు జరగకుండా చూడాలన్నారు. స్వయం శక్తి సంఘాల మహిళలకు అక్రమ మద్యం నిరోధంపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ బెల్ట్ షాపుల సమాచారం ఇవ్వాలని, ఎక్సైజ్ సిబ్బంది చర్యలు తీసుకోకపోతే నేరుగా తన దృష్టికి తీసుకు రావొచ్చని అన్నారు. ప్రభుత్వం అక్రమ మద్యం గుర్తించటానికి ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను తీసుకొచ్చిందని, లేబుల్‌ను స్కాన్ చేస్తే అది ఏ మద్యం దుకాణం నుంచి అనేది గుర్తించడానికి వీలుంటుందని అన్నారు. ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసిన తర్వాత మాత్రమే అమ్మాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా పరిషత్ సిఇఒ నారాయణ మూర్తి, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి ఉషారాణి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్లు, జోనల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

విలీన పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్: జివిఎంసిలో విలీనమైన పంచాయతీ, కాంట్రాక్టు కార్మికులకు, మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, 12వ పిఆర్‌సి ప్రకటన చేసి అమలు చేయాలని కోరుతూ ఈ నెల 21న జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుకూటిరాజు తెలిపారు. శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాజువాక, పెందుర్తి, మధురవాడ ప్రాంతాల్లో పనిచేస్తున్న జివిఎంసి, పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులు, ప్రస్తుతం పనిచేస్తున్న వారు, రిటైరైన వారు, చనిపోయిన వారి స్థానంలో చేరిన వారు, ఫోన్ నెంబర్లు వివరాలతో సహా ఆ రోజు ధర్నా కార్యక్రమానికి సకాలంలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఎస్.గణేష్,గొల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పేదలకు, అణగారిన తరగతుల వారికి ఉచిత న్యాయ సహాయాన్ని, మరింత సమర్థంగా అందించాలని ప్రజల్లో అవగాహన పెంచడంలో చొరవ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం, న్యాయసేవా పథకాల అమలు, గ్రామస్థాయి వరకు న్యాయసహాయాన్ని చేరవేయడం వంటి వాటిపై దిశానిర్దేశం చేశారు. ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు తమ సేవలను మరింత అంకితభావంతో కొనసాగించాలన్నారు. సమావేశంలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

'లోటస్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: గత 18 సంవత్సరాలుగా లోటస్ హాస్పిటల్స్ అందిస్తున్న విశేష సేవలు అభినందనీయమని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ప్రశంసించారు. శనివారం విశాఖలో లోటస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నవజాత శిశువుల ఆత్మీయ, ఆరోగ్య సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వాణి హాజరై తల్లీ, పిల్లల వైద్య విభాగంలో లోటస్ హాస్పిటల్స్ చేస్తున్న సేవలను కొనియాడారు. హాస్పిటల్స్ డైరెక్టర్ కెవి కృష్ణ వర్ధన్ మాట్లాడుతూ విశాఖపట్నంలో గత సంవత్సర కాలంలో నూతన నవజాత శిశువుల (అప్పుడే పుట్టిన పిల్లలు) విభాగంలో సుమారు 150 మందికి పైగా చిన్నారులకు విజయవంతంగా వైద్యసేవలు అందించి సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ విభాగాన్ని మొట్టమొదటి నియోనాటాలజీ విభాగంలో డిఎం అర్హత సాధించి 25 సంవత్సరాల అనుభవం కలిగిన డాక్టర్ శేషగిరి ఎండీ (పీడియాట్రిక్స్), డిఎం (నియోనాటాలజీ) ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఎండీ (పీడియాట్రిక్స్) విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగస్వాములుగా నిలిచిన నర్సులను డాక్టర్ శేషగిరి బృందం ఘనంగా సన్మానించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ సిహెచ్. మాధురి పాల్గొన్నారు.

సమ్మెలో అద్దెబస్సు డ్రైవర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: అద్దెబస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ వాల్తేర్ డిపో హైర్ బస్సు డ్రైవర్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి సమ్మె చేపట్టారు. సమ్మె కారణంగా డిపోలోని 29 అద్దె బస్సులు నిలిచిపోయాయి. సమ్మెలో హైర్ బస్సు డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు 75 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్తేరు డిపో హైర్ బస్సు డ్రైవర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ విశాఖపట్నం వాల్తేర్ డిపోలో హైర్‌బస్ డ్రైవర్లకు జీతాలు పెంచాలని పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, ఆర్టిసి జిల్లా పాసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలల నుండి హైర్‌బస్ యజమానులకు, వాల్తేర్ డిపో మేనేజర్, జిల్లా ఆర్ఎంకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. ఎపిఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ మాట్లాడుతూ లేబర్‌యాక్ట్ ప్రకారంగా జీతాలు పెంపుదలతో పాటు అన్ని డిమాండ్లు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వాల్తేర్ డిపో అద్దె బస్సు డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.జంపన్న, పి.రఘు, ఎపిఎస్ఆర్టీసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివ, కార్యదర్శి అర్జున్,అద్దె బస్సు డ్రైవర్లు, ఔట్సోర్సింగ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION): AT VISAKHAPATNAM
O.S.1909/2022

Between:
Kovvuri Srinivasa Reddy ...Plaintiff
And:
Samskruthi Infra Projects
Rep., by its Managing Partner
Vysyaraju Srinivasa Raju & 4 others ...Defendants

SUMMONS

To
D-1: Samskruthi Infra Projects,
Rep., by its Managing Partner
Vysyaraju Srinivasa
Raju, D.No.50-17-36/36,
Opp. Reliance Petrol Bunk,
Near Prism Degree College,
Rajendra Nagar, Visakhapatnam-16.

The above named plaintiff has filed the above suit for recovery of money basing on the sale agreement and for costs of the suit, etc., and the Hon'ble Court was pleased to order issuance of notice to you by way of substituted service of summons i.e., Paper publication as you have intentionally avoided service of notice. You are hereby summoned to appear before the above mentioned Court on dt: **10-11-2025** at **10.30 A.M.** in person or through an advocate in the above case or else the matter will be heard and determined in your absence.
(By Order of the Hon'ble Court)
P. SUBBA REDDY,
Advocate
Viskakhapatnam,
Cell: 7386239666

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
F.C.O.P. 882/2024

బిట్వీన్
శ్రీమతి పుప్పాల సుప్రజ & మరొకరు...పిటీషనర్స్
అండ్
శ్రీ పుప్పాల అశోక్ కుమార్ ...రెస్పాండెంట్
టు **నోటీసు**

రెస్పాండెంటు:
శ్రీ పుప్పాల అశోక్ కుమార్,
S/o. పి. సత్యారావు, హిందు, వయస్సు: 47 సం॥లు, నివాసం: ఫ్లాట్ నెం. 308 యం.కె. ప్రెస్టేజ్ అపార్ట్‌మెంట్ లక్ష్మీవానిపాలెం, పి.యం. పాలెం, మధురవాడ 1వ బస్టాప్, విశాఖపట్నం-41.

పైనెంబరు పిటీషన్‌లో పై తెలిపిన పిటీషనర్‌గారు మీపై విడాకుల కొరకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ నందు కోర్టు ద్వారా పంపిన నోటీసులు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్‌లో మీ హాజరు కొరకు **తేది. 29-10-2025**న వాయిదా అయివున్నది. ఆ దినమున మీరు ఉ॥గం॥10.30ని॥లకు స్వయంగానుగాని, వకీలు గారి ద్వారాగాని పై తెలిపిన శ్రీ కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పై పిటీషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించెదరని ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.
KOMMU PADMAJA, Advocate
Visakhapatnam. **Cell: 94406 36066**

BEFORE THE HONORABLE SENIOR CIVIL JUDGE, NUZVID
HMOP NOP. 98/2025

Between:
Bejawada Sujini,
W/o. Edubilli Venkata Ramana, resident of D/o. Venkateswara Rao, d.no. 2-4, Nuzvid Road, Bapulapadu Village and Mandal ...**petitioner**
And
Edubilli Venkata Ramana,
S/o. Simhachalam, resident of D.No. 65-4-373/A, Kotha Nakkavani palem, near Saibaba Temple, Malkapuram, Visakhapatnam - 530011 ...**Respondent**
To,
Edubilli Venkata Ramana,
S/o. Simhachalam, resident of D.No. 65-4-373/A, Kotha Nakkavani palem, near Saibaba Temple, Malkapuram, Visakhapatnam - 530011

The Honourable Senior Civil Judge, Nuzvid had ordered notice to you on 17-10-2025 in op no. 98/2025 filed against you by the above petitioner praying for divorce. You are hereby informed to appear before the honourable Court in person or by pleader **on 30-12-2025 at 10.30 am** and submit your objections if any, failing which you will be set exparte

NVNK DURGA PADMANJALI
Nuzvid Advocate for Petitioner,
Dt. 17-10-2025 Nuzvid
Cell: 93968 26418

తర్లువాడ దళితుల భూములు కాపాడాలని వినతి

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలోని దళిత కుటుంబాలకు జీవనాధారమైన భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవద్దని గ్రామస్తులు డిమాండ్ చేశారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఎంపీ, డిఎస్ఎంఎం జాతీయ అధ్యక్షులు కె.రాధాకృష్ణన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులను తర్లువాడ దళిత రైతులు శనివారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై దళితులకు మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, భీమిలి కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, సహాయ కార్యదర్శి అప్పలనాయుడు రైతుల సమస్యలను నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, 1972లో ప్రభుత్వం 52 మంది దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రెండెకరాలు చొప్పున బంజరు భూములను కేటాయించిందని, రాళ్లు, రప్పలతో నిండిన భూములను అప్పులు చేసి కష్టపడి చదునుచేసుకొని 53 సంవత్సరాలుగా జీవనాధారంగా ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. పదేళ్లగా డంపింగ్ యార్డు, బ్యాటరీ కంపెనీ, ల్యాండ్ పూలింగ్ పేర్లతో భూములను తీసుకునేందుకు అధికారులు యత్నించారని, తమ జీవనాధారమైన భూములను వదులుకోవడానికి సిద్ధంగా లేమని స్పష్టంచేశారు. ఇటీవల రెవెన్యూ అధికారులు రీసర్వే పేరుతో అక్రమంగా భూముల వివరాలు సేకరించి, గూగుల్ డేటా సెంటర్ కోసం కేటాయిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ఈ నెల 16వ తేదీన పిలిపించి "భూములు తప్పనిసరిగా గూగుల్ సెంటర్‌కు ఇవ్వాల్సిందే" అని చెప్పారని గ్రామస్తులు వెల్లడించారు, తమను చంపినా భూములు ఇవ్వబోమని గ్రామస్తులు స్పష్టంచేశారు. తర్లువాడ దళితుల సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు కోవాలని జగ్గునాయుడు, ఆర్ఎస్ఎన్.మూర్తి, దళిత రైతులు డిమాండ్ చేశారు.

సిపిఎం ఎంపీ రాధాకృష్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న తర్లువాడ దళితులు

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక ఉడా కాలనీలో శనివారం లారీ ఢీకొని ఒక మహిళ దుర్మరణం చెందారు. ఆమె మనవడుకు తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక నుంచి ఇసుక లారీ ఉడా కాలనీ సమతానగర్‌కు వస్తోంది. డ్రైవర్ అతి వేగంగా నడుపుతూ సమతానగర్ వద్ద అదుపు తప్పి కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న వియ్యపు అప్పయ్యమ్మ (55)పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. ఆమె మనవడు సాత్విక్ తీవ్ర గాయాల పాలై ఆర్కె.హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు.

భారీ ఆందోళన

ఈ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలని, మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు వియ్యపు వానిపాలేనికి చెందిన గ్రామస్తులందరూ రోడ్డుపై బైఠాయించారు. నాలుగు వైపులా రాకపోకలను నిలువరించారు. వీరి పోరాటానికి సిపిఎం నాయకులు నమ్మి రమణ, పల్లా కార్తీక్, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మద్దతు తెలిపారు. నష్ట పరిహారంపై లారీ ఓనర్ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో మృతదేహాన్ని అక్కడే ఉంచి ఆందోళన కొనసాగిస్తున్నారు.

అనధికార మందుగుండు సామగ్రి పట్టివేత

ప్రజాశక్తి-ములగాడ : మల్కాపురం మార్కెట్‌లో శనివారం సిఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యాన పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. మార్కెట్ ఏరియాలో పీల ప్రసాద్, మరిపెల్లి శశికుమారి అనధికారికంగా ఉంచిన దీపావళి మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఎవరైనా అనధికారికంగా మందు గుండు సామాగ్రి నిలవ ఉంచినా, తయారుచేసినా అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో సఖి సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం తోటగరువు రాధాకృష్ణా కల్యాణమండపంలో డ్వాక్రా మహిళల కోసం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. 9, 10, 11, 12, 13 వార్డుల నుంచి అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ, వైద్య పరీక్షలు చేయించుకున్న మహిళలకు రిపోర్టులను వాట్సాప్‌కు పంపిస్తారని తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారికి ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల ఆరోగ్య బీమా సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ బీమా సౌకర్యంతో మీ కుటుంబంలోని ఎవరైనా ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ డాక్టర్ సురేంద్ర, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎపిడి శ్రీరామ్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, గాడు అప్పలనాయుడు, పోలారావు, ఏడువాక సన్యాసిరావు, కెల్ల సత్యనారాయణ, మద్దిల రాజేష్, మూది అప్పారావు, యల్లమిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం పరిశీలన

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి పంచాయతీ సర్వే నంబర్ 39/5లో పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని మండల విద్యాశాఖ అధికారులు జోగేంద్రనాథ్, గంగరాజు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉండడంతో విద్యార్థుల భద్రత దృష్ట్యా కొత్త భవనాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో స్థలాన్ని పరిశీలించామని అధికారులు తెలిపారు. స్థల వినియోగానికి సంబంధించి పంచాయతీ అనుమతి పత్రం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు నాగరాజు, కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన 'దీక్షారంభం'

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల ప్రారంభమైన దీక్షారంభం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా హాజరైన కడప జిల్లా పోరిమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సామ్యూల్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానం 2020పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సురేఖ మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి హెచ్.విష్ణుమూర్తి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

డ్రోన్లతో విత్తనాలు

ప్రజాశక్తి - భీమునిపట్నం : స్థానిక మిషన్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో రెండు డ్రోన్ల ద్వారా సౌమ్య గిరిపై సుమారు రెండు కిలోల కానుగ, కుంకుడు విత్తనాలను చల్లే కార్యక్రమాన్ని జివిఎంసి అడిషనల్ కమిషనర్ రమణమూర్తి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లగా సౌమ్య గిరిపై విత్తనాలు వేసి ఆ ప్రాంతం పచ్చగా మారడానికి మిషన్ గ్రీన్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ, చల్లిన విత్తనాలు వృక్షాలై వలు పక్షి జాతుల మనుగడకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆదిత్య, జి.వెంకటేష్, జెవి.రత్నం, ఆర్.బసవకృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిలిచిన నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - ఆనందపురం: వెల్లంకిలో రవీంద్ర స్కూల్ సమీప సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యపై టిడిపి యువనాయకుడు గంటా రవితేజ దృష్టికి వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాకర సురేష్‌కుమార్ తీసుకెళ్లారు. రవితేజ స్పందించి ఎన్‌హెచ్ -5 అధికారులతో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలి

డాక్టర్ అర్పితారెడ్డి

ప్రజాశక్తి - ఆరిలోవ : దీపావళి పండగను ఆనందంతో పాటు అత్యంత సురక్షితంగా జరుపుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, జిఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్ అత్యవసర సేవల ఇన్‌ఛార్జి వైద్యులు డాక్టర్ అర్పితా రెడ్డి, డాక్టర్ నికితాదాస్ తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాలలో శనివారం దీపావళికి మందు గుండు సామగ్రిని కాల్చే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ అర్పితారెడ్డి, డాక్టర్ నికితాదాస్ మాట్లాడుతూ, ఈ పండగలో అత్యంత ఆనందంతో పాటు ప్రమాదం కూడా ఉందని, దీనిని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ప్రమాదవశాత్తు కంటికి గాయమైతే సున్నితంగా శుభ్రం చేయాలని, కంటిలో ఏదైన నలకలు ఉంటే శుభ్రమైన నీరు, లేదా సెలైన్‌తో శుభ్రం చేయాలి తప్ప కంట్లో నలకలు తొలగించేందుకు ఇతర పదార్థాలను ఉపయోగించరాదని తెలిపారు. గాయపడిన వ్యక్తిని వెంటనే కంటి సంరక్షణా నిపుణుల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. పిల్లలు టపాసులు పేల్చే సమయంలో పెద్దల పర్యవేక్షణ తప్పనిసరన్నారు. టపాకాయలు కాల్చేటప్పుడు కళ్లజోడు ధరించడం, లూజుగా సిల్క్ వస్త్రాలు ధరించకపోవడం మంచిదని చెప్పారు. టపాసులు పేల్చే ప్రదేశంలో రెండు, మూడు బకెట్లతో చల్లని నీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

పలుచోట్ల స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక బీచ్ పార్కులో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ నాగలక్ష్మి, ప్రధాన వైద్యాధికారి ఇఎన్‌వి.నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : తోటగరువు జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు ఏర్పాటు చేసిన వైట్ బోర్డుపై బాలికల సంరక్షణకు మద్దతు తెలుపుతూ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సంతకం చేశారు. అనంతరం వివిధ పోటీల్లో, చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు, జ్ఞాపికలను కలెక్టర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్, ఒమ్మి సన్యాసిరావు, ఐసిడిఎస్ పీడీ రామలక్ష్మి, డిఇఒ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరు కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో జిల్లా కలెక్టరు పాల్గొని శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని సాధించుటకు వాహన కాలుష్యాన్ని తగ్గించవలసిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం ఒక అడుగు ముందుకు స్వచ్ఛత వైపు అంటూ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

ఎస్పీ కార్యాలయంలో..

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం వరదలు, అంటువ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మీ, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన మెరుగుపడాలి : ఎంఇఒ

ప్రజాశక్తి -తగరపువలస : ఉపాధ్యాయులు బోధనను మెరుగుపరుచుకోవాలని ఎంఇఒ శివరాణి సూచించారు. భీమునిపట్నం మండలం లక్ష్మీపురం జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం ఆమె సందర్శించి మాట్లాడారు. వర్క్ బుక్ కరెక్షన్ చేయాలని, ఎఫ్ఎ-2 పరీక్ష పేపర్లు దిద్ది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అనుమతి లేకుండా ఎవరూ సెలవులు పెట్టకూడదని చెప్పారు. లక్ష్మీపురం హెచ్ఎం దంతంశెట్టి సత్యారావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలని చెప్పారు.

లక్ష్మీపురం విద్యార్థుల ప్రతిభ

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో లక్ష్మీపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్.చిన్ని, కె.అక్షయ, కె.యామిని విజేతలుగా నిలిచారు. వారికి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఎన్.హరేంధిర్‌ప్రసాద్ శనివారం బహుమతులు అందజేశారు.

సేవ్ ద గర్ల్ చైల్డ్ పోటీలో తేజేశ్వరి ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : సేవ్ ద గర్ల్ చైల్డ్ పోటీలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జివిఎంసి ఉన్నత పాఠశాల విద్యార్థిని కొప్పల తేజేశ్వరి ప్రతిభ చాటారు. వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థినికి శనివారం తోట గరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర్‌ప్రసాద్, డిఇఒ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో కొప్పల తేజేశ్వరి బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా తేజేశ్వరిని పాఠశాల హెచ్ఎం వై.స్వామి, ఎస్.జగదీష్, రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు అభినందించారు.

అయినాడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అయినాడ రామ మందిరం వద్ద హ్యూమన్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కురిమిన లీలావతి సమక్షంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 120 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంలో లీలావతి మాట్లాడుతూ, భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎటువంటి రక్తపరీక్షలు చేయకుండా నాడీ ద్వారా బాడీ స్కానింగ్ టెస్టులు చేసి రిపోర్టులను అందించడమే కాకుండా, ఆ రిపోర్టు ఫలితాలు పరిశీలించి కౌన్సెలింగ్ ఇవ్వటం గర్వించదగ్గ విషయమన్నారు. ఇంటిలో దొరికే జీలకర్ర, వాము, మెంతులు పసుపు, ఆవాలు, వెల్లుల్లి, కలబంద, తమలపాకు వంటి దినుసులతో మందు తయారు చేసుకొని సుగర్, బీపీ, గ్యాస్టిక్ తదితరాలను తగ్గించుకునే విధానం ఎంతో అమూల్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిన్నారావు, డాక్టర్ వెంకటేశ్వరులు, డాక్టర్ గంగరాజులు, సిస్టమ్ ఆపరేటర్ శ్రావణి పాల్గొన్నారు.

సమరశీల ఐక్య పోరాటాలు ఉధృతం

సిపిఎం ఎంపీ కె.రాధాకృష్ణన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మికవర్గం సమరశీల ఐక్య పోరాటాలను మరింత ఉధృతంగా చేయాలని సిపిఎం పార్లమెంట్ సభ్యులు కె.రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) 12వ మహాసభను ఉక్కునగరంలోని గురజాడ కళాక్షేత్రంలో శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కె.రాధాకృష్ణన్ హాజరై మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తూ, పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలను చేయడం ద్వారానే నేటికీ ఈ పరిశ్రమ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతోందని తెలిపారు. ఈ పరిశ్రమను కాపాడుకోవడం కోసం పార్లమెంటు వేదికగా పోరాట గళాన్ని వినిపించే ప్రయత్నం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు డివిఎస్.రెడ్డి మాట్లాడుతూ, కార్మిక సంఘాలు లేని కర్మాగారాలను దేశవ్యాప్తంగా సృష్టించాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం అత్యంత వేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే కార్మికులు, కార్మిక సంఘాల ఐక్యతను విభజిస్తూ కర్మాగారాలపై దేశ విదేశీ పెట్టుబడిదారుల ఆధిపత్యాన్ని పెంచుతున్నారని వివరించారు. ఐక్యతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్న సిఐటియును బలహీనపరిచేలా ఎత్తుగడలను ప్రదర్శిస్తూనే ఉందని విమర్శించారు. ఈ పరిస్థితులను ఎదుర్కొంటూ ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేయడం ఈ మహాసభ ద్వారా జరగాలని ఆకాంక్షించారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ రక్షణకు అత్యంత ప్రాధాన్యత కలిగించే విధంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ పని మరింత మెరుగుపరచుకోవాలన్నారు. మన పోరాటం, రాష్ట్ర ప్రజల మద్దతుతో కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో ప్యాకేజీని ప్రకటించిందని, కర్మాగారం ఉపశమనం కంటే కార్మిక వర్గంపై పెద్ద ఎత్తున నిరంకుశ నిర్బంధాన్ని వేగం చేసిందని తెలిపారు. ఇప్పటికే కర్మాగారంలో కార్మికుల సంఖ్య తగ్గి ఉత్పత్తిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందన్నారు. నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ మహాసభ ద్వారా సమరశీల పోరాటాలను నిర్మించే విధంగా కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు, ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు ఎన్.రామారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, నాయకులు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, బి.తౌడన్న, టివికె.రాజు, బి.అప్పారావు, పుల్లారావు, యు.వెంకటేశ్వర్లు, నీలకంఠం, వి.మురళి, బి.మహేష్, ఆర్.రాజేశ్వరరావు, ఎ.శ్రీనివాస్, వి.ప్రసాద్ తదితరులతోపాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలో మాట్లాడుతున్న రాధాకృష్ణన్

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎసిపి నరసింహమూర్తి

వ్యసనాలకు దూరంగా యువత

ప్రజాశక్తి-సీతమ్మధార : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రైమ్ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి సూచించారు. ద్వారకానగర్‌లోని అలెన్ ఇన్‌స్టిట్యూట్లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తుపదార్థాలకు, మద్యానికి యువత దూరంగా ఉండాలన్నారు. యువత బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. ప్రతి ఒక్కరి ఇంట్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లో పెట్టుకోవాలని చెప్పారు. దీపావళి పండుగ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ సిఐ చక్రవర్తి, ద్వారక ఎస్ఐ ఎస్.రాజు, ఇనిస్టిట్యూట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి దీపాల మరమ్మతులు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి 80 అడుగుల రోడ్డులో పలుచోట్ల వీధి దీపాల మరమ్మతులు, కొన్ని చోట్ల కొత్తలైట్లు శనివారం వేశారు. వార్డు పరిధిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని వార్డు టిడిపి అధ్యక్షులు ముక్కా కిషోర్‌కుమార్ తెలిపారు.

శీపాన రాముకు సన్మానం

రామును సన్మానిస్తున్న చంద్రమౌళి

ప్రజాశక్తి- మాధవధార : వైఎస్‌ఆర్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శీపాన రాముకు వియంఆర్‌డిఎ మాజీ ఛైర్మన్ సనపల చంద్రమౌళి శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి అభివృద్ధికి సిపాన రాము చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలందరికీ పార్టీ గుర్తింపునిస్తుందని తెలిపారు. రాము భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు దంపతులు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం పూర్తయ్యాక, ఆలయ పండితులు వారికి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

ముగిసిన ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జిఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. శనివారం అండర్ 14 బాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్, ఖోఖో, రన్నింగ్ వంటి పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు నిర్వహించే డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. గెలుపొందిన క్రీడాకారులను ఆనందపురం పిఎసిఎస్ అధ్యక్షులు పొండ్రింకి అప్పలరాజు, ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, దివీస్ యాజమాన్యం సిబ్బంది కలిసి అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జి తదితరుల పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, భాస్కరరావు, ముత్యాల నాయుడు, శంకర్రావు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొట్టాడ సత్యమూర్తి, మద్ది శేఖర్, ఉపాధ్యాయులు భాస్కరరావు, ప్రేమానందరావు, ముత్యాలనాయుడు, శంకరరావు, భీష్మ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదాని సిమెంట్‌ను అడ్డుకుంటాం

కరపత్రాలు విడుదల చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడలో అదాని అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను పోరాటాల ద్వారా అడ్డుకుంటామని అదాని అంబుజా సిమెంట్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ స్పష్టంచేసింది. పెదగంట్యాడ సిడబ్ల్యూసిలో శనివారం పోరాట కమిటీ సమావేశం నిర్వహించారు. అదాని అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను వ్యతిరేకిస్తూ ముద్రించిన కరపత్రాలను ఈ సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ, కాలుష్యం వెదజల్లే ఈ పరిశ్రమల వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పోరాట కమిటీ కన్వీనర్లు ఎన్.రామారావు, కసిరెడ్డి సత్యనారాయణ, జి.అచ్చిబాబు, నాయకులు కెఎం.శ్రీనివాస్, జి.ఆనంద్, నమ్మి రమణ, బొంతు అప్పారావు, ఎం.రాంబాబు, డి.వెంకట్రావు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ప్రతినిధులు

'మిలీనియం'లో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-సీతమ్మధార : జియోసిస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో మిలీనియం సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్‌లో శనివారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. క్యుఐఎస్ ఇంజినీర్ కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు 145 మంది బిటెక్ మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థులు హాజరయ్యారు. ఆటోకాడ్, క్యుఐఎస్ నైపుణ్యాలు ఉన్న 65 మందిని ఎంపికచేసినట్లు మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరదా రవి కుమార్ తెలిపారు. వచ్చే వారం సాఫ్ట్‌వేర్ డెవలపర్ పోస్టుకు మరో ప్రముఖ ఐటి కంపెనీతో క్యాంపస్ డ్రైవ్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. 25 సంవత్సరాలుగా తమ సంస్థ క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తూ 5,50,000 మందికి పైగా విద్యార్థులను పలు సంస్థల్లో ఉద్యోగాల్లోకి చేర్పినట్లు చెప్పారు. జియోసిస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ డి.ధర్మారావు మాట్లాడుతూ, ఈ సంస్థ ఆర్కిటెక్చరల్, ఇంజినీరింగ్, కనస్ట్రక్షన్, జియోస్పేషియల్ సొల్యూషన్స్ రంగంలో ప్రముఖ సంస్థగా ఉందని, ఇక్కడ మంచి కెరీర్ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మెకాట్రానిక్స్ (మెకానికల్ ఇంజినీరింగ్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ కలయిక) రంగం ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. మెకానికల్ విద్యార్థులు కూడా పైథాన్, జావా, డేటా సైన్స్ వంటి ప్రోగ్రామింగ్ కోర్సులను నేర్చుకోవడం ద్వారా మంచి కెరీర్ అవకాశాలు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ చిన్ని, హెచ్‌ఆర్ మేనేజర్ బి.దివ్యజ్యోతి, జె.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 27వ వార్డు పరిధిలో ఆధునీకరించిన జివిఎంసి ప్రైమరీ స్కూల్‌ను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. కొన్ని నెలల క్రితం వార్డు పర్యటనలో భాగంగా సిబిఎం దొండపర్తి జివిఎంసి ప్రైమరీ స్కూల్‌ను ఎమ్మెల్యే సందర్శించిన సమయంలో పాఠశాల భవనం చాలా అధ్వాన్నంగా ఉండడాన్ని గమనించారు. దీనికి రూ.18 లక్షలు మంజూరు చేయించి ఆధునీకరించారు. ఆ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. వార్డులో రోడ్లు, డ్రైనేజీతో పాటు అనేక అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ప్రకాష్‌రెడ్డి, గుండు సురేష్‌బాబు, సత్యనారాయణరెడ్డి, మహేష్‌రెడ్డి, శివ, సతీష్, రాజేష్, లలిత, పెదరాజు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఎఇఇ రామారావు, బాలామణి, హెచ్‌ఎం నిర్మల,స్కూల్ కమిటీ ఛైర్మన్ రాములమ్మ, టీచర్ మాధవి పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలి

సంతకాలు సేకరిస్తున్న జియ్యాని శ్రీధర్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటుకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నాయకుడు పతివాడ కనకరాజు పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర బిసిసెల్ ఉపాధ్యక్షులు కెఆర్.పాత్రుడు, జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాస్, వైదా నారాయణరావు, పతివాడ వెంకటలక్ష్మి, కన్నబాబు, ఒమ్మి శ్రీను, వరలక్ష్మి, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 52వ వార్డులో వైసిపి కోటి సంతకాల సేకరణ చేపట్టింది. వార్డులోని వైసిపి కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హాజరై వార్డులో సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, దీనిని రాష్ట్ర ప్రజలు ఒక రాజకీయ కార్యక్రమంగా కాకుండా రాబోయే తరాల విద్యార్థుల భవిష్యత్తు కోసం దోహదపడే కార్యక్రమంగా భావించి ఈ సంతకాల సేకరణలో స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఎస్.కృష్ణ, శ్రీదేవివర్మ, సఖీ, తదితరులు పాల్గొన్నారు.

నెగ్గిన అవిశ్వాస తీర్మానం

- ఎంపిపి పదవి కోల్పోయిన గోవిందరావు
- కొత్త ఎంపిపిగా జనసేన నేత
రాజాన శేషు ఎంపిక లాంఛనమే!

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి ఎంపిపిపై రెండు నెలలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు శనివారం తెరపడింది. వైసిపి నుండి జనసేన సేనలో చేరిన ఎంపిటిసి సభ్యులు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానంపై శనివారం సాయంత్రం 4 గంటలకు అనకాపల్లి ఆర్‌డిఒ ఆయేషా సమక్షంలో జరిగిన సమావేశానికి వైసిపి అనుకూల ఎంపిటిసిలు... ఎంపిపి గోవిందరావు, ఆయన మద్దతుదారు పూటకూడి రామగణేష్ (బయ్యవరం) హాజరు కాలేదు. మండలంలో ఉన్న ఆరుగురు ఎంపిటీసీల్లో అవిశ్వాసానికి తెరలేపిన రాజాన శేషు (పురుషోత్తపురం), శిలపరశెట్టి ఉమా గణేష్ (జంపపాలెం), నగిరెడ్డి అమ్మాజీ (ఏటికొప్పాక), బర్రె శివలక్ష్మి (కొత్తలి) హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తి మద్దతు తెలపడంతో అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీఓ ఆయేషా ప్రకటించారు. జరిగిన పరిణామాలను జిల్లా పరిషత్ సిఇఒ, జిల్లా కలెక్టర్‌లకు ఆర్డీవో తెలియజేశారు. ఆదివారం, దీపావళి వరుస సెలవులు కావడంతో మంగళ బుధవారాల్లో మండల సభ్యుల సమావేశం ఏర్పాటు చేసి కొత్త ఎంపిపిని ఎన్నుకొనే అవకాశం ఉంది. ఎమ్మెల్యే విజయకుమార్ వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో జనసేన ప్రతినిధి పురుషోత్తపురం ఎంపిటిసి, వైస్ ఎంపిపి-1 రాజాన శేషు ఎంపిపిగా పదవీ స్వీకారం త్వరలోనే జరుగుతుందని భావిస్తున్నారు. కార్యక్రమం ముగిసిన వెంటనే పలువురు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ మండల పరిషత్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. కార్యక్రమానికి ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. అవిశ్వాస బలపరీక్ష నేపథ్యంలో స్థానిక తహశీల్దార్ కె.వరహాలు, ఎంపిడిఒ కె.కొండలరావు, ఏఓ శ్రీనివాసరావు

అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన ఎంపిటిసి సభ్యులు, అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు ప్రకటిస్తున్న ఆర్‌డిఒ ఆయేషా

మెటీరియల్ చూపుతున్న ఎంఇఒ శివనాయుడు, యుటిఎఫ్ నేతలు

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -మునగపాక : ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ, విద్యావేత్త, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె లక్ష్మణరావుచే రచించబడిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ బుక్స్ మండల విద్యాశాఖ అధికారి బుద్ధ శివ నాయుడు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, యుటిఎఫ్ నాయకులు రేబాక రవికుమార్, పీలా ఆషా, శంకర్ పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కెపి.అగ్రహారం గ్రామంలో శనివారం జడ్పీటీసీ దొండా రాంబాబు జిల్లా పరిషత్ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోపిశెట్టి శ్రీను, పెదిరెడ్ల మాణిక్యం, పినిశెట్టి రమణ, అద్దిపల్లి సోమనాయుడు, పినిశెట్టి మాణిక్యం వియ్యపు రమణ, వియ్యపు రమేష్, దేవుళ్ళు పాల్గొన్నారు.

సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో స్కాలస్టిక్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-పరవాడ : సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థుల ఆచరణాత్మక నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ స్కాలస్టిక్ ఎక్స్‌పో శనివారం నిర్వహించారు. దీనిని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి ప్రారంభించారు. సుమారు 450 ప్రాజెక్టులు ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ, అన్ని సబ్జెక్టులపై ఇంత స్పష్టతతో ఈ వయస్సులోనే ప్రాజెక్టులు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ కె. నిశాంత్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ సిబ్బందికి బహుమతులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : దీపావళి పండుగ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా పరిశ్రమలో పనిచేస్తున్న 14 వేల మంది సిబ్బందికి బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి చేతుల మీదుగా శనివారం బహుమతులను పంపిణీ చేశారు.

అమర్‌నాథ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-సబ్బవరం : మాజీ మంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్‌పై పెందుర్తి టీడీపీ ఇంచార్జి చైర్మన్ గండి బాబ్జి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగవని వైసిపి పెందుర్తి నియోజకవర్గ నాయకులు గండి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని మొగలిపురం గ్రామంలోని తన నివాసంలో ఆయన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్‌లో ఎంతమందికి ఉపాధి కలుగుతుందో గూగుల్ డేటా సెంటర్ సిఈఓతో ప్రకటన చేయించాలని అమర్‌నాథ్ అనడం తప్పా? అని ప్రశ్నించారు. దీనిపై బాబ్జి కుక్కకి సింహాసనానికి తారతమ్యం లేదా అనడం తగదని పేర్కొన్నారు. విమర్శలపై సరైన సమాధానం చెప్పాలి తప్పా వ్యక్తిగత దూషణలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు ఎడ్ల నాయుడు, బైలపూడి దేముడు పాల్గొన్నారు.

సోలార్ వినియోగంతో డబ్బు ఆదా

ప్రజాశక్తి-చోడవరం : సోలార్ వినియోగం ద్వారా వినియోగదారులకు డబ్బు ఆదాతో పాటు విద్యుత్తు సేవ్ అవుతుందని ఎలక్ట్రికల్ ఏడి సురేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం చోడవరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సోలార్ సిస్టం ద్వారా ఎవరికి వారే తమ ఇండ్లపై కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీతో యూనిట్లు అమర్చుకోవాలని సూచించారు. అనంతరం సూపర్ జీఎస్టీపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ రామరాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాయుడు, చోడవరం డివిజన్ 4 మండలాలకు చెందిన విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ ఉద్యోగులు

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో పనలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శనివారం సాయంత్రం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శంకుస్థాపనలు చేశారు. కోటి రూపాయలతో లింగాపురం నుండి వెంకటాపురం రోడ్డు, రూ.1.45 కోట్లతో ఎండపల్లి నుండి వేములపూడి వరకు, రూ.1.45 కోట్లతో ఎల్విఁకే రోడ్డు నుండి నీలిగుంట వరకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కాశీనాయుడు, లింగన్న నాయుడు, జనార్ధన్, శ్రీనివాస్, జానకి శ్రీను, తిరుమలరావు, వేచలపు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండలంలో 2.45 కోట్లుతో నిర్మించనున్న మూడు రోడ్లకు శనివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శంఖుస్థాపన చేశారు. రూ.60 లక్షలతో రాజగోపాలపురం నుండి కందిపూడి వరకు, కోటి రూపాయలతో మంగవరం నుంచి పెంటకోట వరకు, రూ.85 లక్షలతో గుంటపల్లి ఒండిమెట్ట మీదిగా రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గుంటపల్లిలో 21.80 లక్షల నిధులతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని, రూ.25.00 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని అనిత ప్రారంభించారు. పట్టణంలో త్వరలో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చించలపు ప్రదీప్ (పద్దు), యాళ్ల వరహాలబాబు, తోట నగేష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, గొర్రెల రాజుబాబు, గూటూరు శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : దీపావళి పండుగను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కలెక్టర్ విజయకష్ణన్ ఆకాంక్షించారు. కలెక్టరు కార్యాలయం వద్ద శనివారం కార్యాలయ సిబ్బందితో కలిసి బాణాసంచా వెలిగించి, దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెసి ఎం.జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగాయత్రిలో దీపావళి సంబరాలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శ్రీగాయత్రి ప్రైమరీ అండ్ హైస్కూల్‌లో శనివారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థులు దీపాలు వెలిగించి పాఠశాల పరిసరాలను అందంగా అలంకరించారు. దీపావళి నాటికను ప్రదర్శించారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.రామకుమార్, హెచ్ఎం వై.నగేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాణసంచా వెలిగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కబ్జాకు గురైన గెడ్డ పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందించిన తహశీల్దార్

ప్రజాశక్తి-పరవాడ : "పరవాడలో గెడ్డవాగు కబ్జా' శీర్షికన శనివారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన కథనానికి తహశీల్దారు నాగరాజు స్పందించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విఆర్ఒ, విలేజ్ సర్వేయర్‌తో కలిసి శనివారం ఆయన సర్వే నెంబర్ 226 ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. పరిశీలన సందర్భంగా, గెడ్డవాగు పరిధిలో కొంతమంది వ్యక్తులు భూభాగాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. ఈ భూభాగంపై వివరమైన ఫీల్డ్ ఇన్స్పెక్షన్ నిర్వహించి పూర్తి విచారణ నివేదిక సమర్పించాలని వీఆర్వో, విఎస్‌లను తహసీల్దార్ ఆదేశించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ వివరమైన నివేదిక అందిన వెంటనే ఎపి ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు జరగకుండా గ్రామ సరిహద్దుల్లో నిఘా పెంచాలని, సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు.

కబ్జాకు గురైన గెడ్డవాగును పరిశీలిస్తున్న తహశీల్దారు

రాష్ట్రస్థాయి పోటీలకు మానస ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని మోస మానస ఎంపికయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్ పోటీలలో విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు మత్స్యకార బాలిక మానస అర్హత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మానసను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు, గ్రామపంచాయతీ నాయకులు అభినందించారు.

మోస మానస, డి.కావ్య

కావ్య ఎంపిక

అచ్యుతాపురం : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక కెజిబివి విద్యార్థిని డి.కావ్య ఎంపికైంది. పరవాడ ఎస్వీఎస్ జూనియర్ కళాశాలలో అండర్ 19 బాలబాలికల జిల్లా స్థాయి పోటీల్లో కావ్య ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ ఎస్ ఉమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు బిబి రాణి అభినందించారు.

మోదినాయుడు మృతి రైతాంగానికి తీరని లోటు

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల సహకార చక్కెర కర్మాగారం షేర్ హెూల్డర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొర్లి మోదినాయుడు అకాల మృతి రైతాంగానికి తీరని లోటని రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన వి.వి.రమణ రైతు భారతిలో శనివారం సంతాపసభను అనకాపల్లి వ్యవసాయ దార్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ భాగస్వామి రైతులు తరపున అలుపెరగని పోరాటం చేసారని గుర్తు చేశారు. మోదినాయుడు కుమారుడు గొర్లి శ్యామ్ నాగ మాట్లాడుతూ తన తండ్రి ఆశయ సాధనలో భాగంగా చెరుకు రైతుల తరుపున పోరాటం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రైతు నాయకులు కర్రి దివాకర్, విల్లూరి పైడారావు, ఏవి నూకేశ్వరరావు, శిలపరశెట్టి బాబీ, మల్ల రామకృష్ణ, కర్రి గణేష్, బొండా హరిబాబు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, విల్లూరి కోటేశ్వరరావు, రొంగలి నారాయణ, రొంగలి సింహాద్రిరావు, రైతులు పాల్గొన్నారు.

ఆర్ఐలు ప్రభుత్వ భూములను పరిరక్షించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా రక్షించాల్సిన బాధ్యత రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లపై ఉందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అన్నారు. జిల్లాలోని 26 మంది రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లకు 30.68 లక్షల రూపాయలు విలువచేసే మోటారు సైకిళ్లను జిల్లా కలెక్టరు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఆర్ఐల విధులను దృష్టిలో ఉంచుకొని వారు క్షేత్రస్థాయిలో పర్యటనలకుగాను ఎఎమ్/ఎన్ఎస్ ఇండియా కంపెనీ సిఎస్ఆర్ నిధులతో అందించిన మోటారు సైకిళ్లను అందించటం జరిగిందని చెప్పారు. ఈ వాహనాలను వినియోగించుకొని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించి ప్రభుత్వభూములను రక్షించాలని కోరారు. ప్రతి వారం కనీసం రెండు గ్రామాలలో పర్యటించి 22(ఎ) భూములను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, పరిపాలనాధికారి విజయకుమార్, తహశీల్దార్లు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోలేపల్లి సర్పంచ్ సీతా బుజ్జి

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని సర్పంచ్ సీతా బుజ్జి డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పోలేపల్లి సర్వే నెంబరు 156లో 216 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి కొండను ఆనుకొని ఉందని, గ్రామానికి చెందిన నాయకులు ఆ భూములను ఆక్రమించారని పేర్కొన్నారు. గ్రామానికి ఆనుకొని సదరు భూములు అత్యంత విలువైనవి కావడంతో పగలు రాత్రి తేడా లేకుండా కొంతకాలంగా గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు జెసిబిలతో తుప్పలు డొంకలు తొలగించి చదును చేస్తున్నారని తెలిపారు. ఆ భూముల్లో కొంతమంది దర్జాగా యూకలిప్టస్ మొక్కలను పెంచుతున్నారన్నారు. రెవెన్యూ సిబ్బందికి తెలిసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని, పైగా ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. పోలేపల్లి భూ ఆక్రమణలపై రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఎఎల్ కళాశాలలో శనివారం కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ డోలోరస ఫెర్నాండెజ్, డాక్టర్ ప్రదీప్, క్యాన్సర్ హాస్పిటల్ సూపర్వైజర్ ప్రసాద్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ కరిష్మా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయ బాబు, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, విమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ సామ్రాజ్యం, సూపరింటెండెంట్ పి.అనురాధ పాల్గొన్నారు.

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. అనకాపల్లి టౌన్ గర్ల్స్ హైస్కూల్లో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ కిశోర్ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలని, బాల్య వివాహాలను నివారించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి నేత జాజుల రమేష్, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పి.ప్రభావతి, ఎసిడిపిఒ టి.శశికళ, వెంకటరమణ, రమణ కుమారి, ఇందిరా, మంగతాయారు, ఎంఈఓ పీవీ లక్ష్మి పాల్గొన్నారు.

యువైఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా నగేష్

ప్రజాశక్తి-దేవరాపల్లి : యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ (యువైఎస్ఎఫ్) ఎపి రాష్ట్ర అధ్యక్షుడిగా యోగాచార్య అవార్డు గ్రహీత గెడ్డం నగేష్‌ను నియమిస్తూ ఫెడరేషన్ ప్రధాన కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా గెడ్డం నగేష్ మాట్లాడుతూ యువతలో యోగా స్ఫూర్తిని నింపుతూ, రాష్ట్రంలో యోగా క్రీడా వ్యాప్తికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు.

అంగన్వాడీ కేంద్రంలో ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఇమ్యునైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎఎన్ఎం సునీత పిల్లలకు టీకాలు వేశారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ధనలక్ష్మి, ఆశా కార్యకర్త బి.దేవి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సిసి సమావేశం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో శనివారం మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. పోలేపల్లి, వడ్డాది గ్రామాల నుంచి ఐటీడీఏ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకున్న ఇరు వర్గాలతో సమావేశమయ్యారు. వారి ఫిర్యాదులకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి ఇరు వర్గాలతో మాట్లాడారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దారు వై.శ్రీరామ్మూర్తి, ఎస్ఐ ఎన్.భాస్కరరావు పాల్గొన్నారు.

అదాని స్మార్ట్ మీటర్ల బిగింపు అడ్డగింత

విద్యుత్ శాఖ సిబ్బందిని నిలదీస్తున్న బ్రహ్మాజీ తదితరులు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో శనివారం అదాని స్మార్ట్ మీటర్లు అమరుస్తున్న విద్యుత్ సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. రైస్ మిల్లులు, వర్క్ షాపులకు అదాని స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు వెళ్లిన విద్యుత్ సిబ్బందిని వాటి నిర్వాహకులు సరిసా శివ, ఐతంశెట్టి కృష్ణవేణి, ఎస్ బ్రహ్మాజీ అడ్డుకున్నారు. తమ మీటర్లు సక్రమంగానే పనిచేస్తున్నాయని, మీటర్‌లో లోపాలు ఉంటే తాము ఫిర్యాదు చేస్తే అప్పుడు మార్చాలి తప్పా ఏ కంప్లైంట్ చేయకుండా కొత్త మీటర్లు ఎలా బిగిస్తారని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, తనయుడు లోకేష్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నామని చెప్పి, నేడు అధికారం చేపట్టిన తరువాత అవే మీటర్లను బిగించడం దారుణమన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులు, ట్రూ అప్ చార్జీలతో వ్యాపారాలు అంతంత మాత్రమే ఉన్న తరుణంలో మరింత అధిక బిల్లులు వచ్చేలా అదాని మీటర్లు బిగించడం ఎంతవరకు సబబుని ప్రశ్నించారు. ఇకనైనా విద్యుత్ అధికారులు అదాని మీటర్ల బిగింపు ఆపకపోతే సెక్షన్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనుకోకుండా వినియోగదారుల నుండి తిరుగుబాటు రావడంతో చేసేది లేక విద్యుత్ సిబ్బంది వెనుదిరిగారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

సబ్బవరం మండలంలో విజేతలైన బాలికలు

ఎస్.రాయవరం మండలంలో విజేతలు

ప్రజాశక్తి-సబ్బవరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మండలంలోని తవ్వవానిపాలెం పాఠశాలలో శుక్రవారం ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. అండర్-14, అండర్- 17 విభాగాలలో వాలీబాల్, ఖోఖో, కబడీ, యోగా, లాంగ్ జంప్, రన్నింగ్, డిస్క్ త్రో, 100 మీటర్స్, 200 మీటర్స్, 400 మీటర్స్, 800 మీటర్స్ రన్నింగ్ తదితర అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలకు సర్పంచ్ బోకం స్వామి నాయుడు, ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, ఎంజె.రవీంద్రబాబు, ఉప సర్పంచ్ వనం దేముడు బాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో గెలుపొందిన వారు ఈనెల 21, 22, 23 తేదీలలో అనకాపల్లిలో జరగనున్న డివిజన్ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎస్‌జిఎఫ్ మండల కోఆర్డినేటర్ అబ్దుల్ రెహ్మాన్ తెలిపారు. కార్యక్రమంలో మినర్వా స్కూల్ ప్రిన్సిపాల్ పైల పైడంనాయుడు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యస్.రాయవరం : మండలంలోని కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండలస్థాయి ఆటల పోటీల్లో కబడ్డీ అండర్-14 బాలికల విభాగంలో కొరుప్రోలు జెడ్పి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, చిన గుమ్ములూరు ద్వితీయ స్థానాలు, ఖోఖో అండర్ 14 విభాగంలో చినగుమ్ములూరు ప్రథమ, పెద్ద ఉప్పలం ద్వితీయ స్థానాలు సాధించారు. కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో దార్లపూడి విద్యార్థులు ప్రథమ, చిన గుమ్ములూరు ద్వితీయ, వాలీబాల్ అండర్-17 విభాగంలో పెద్ద గుమ్ములూరు ప్రథమ, ఒమ్మవరం ద్వితీయ స్థానాలు సాధించారు. అండర్-14 బాయ్స్ విభాగంలో వాలీబాల్‌లో కొరుప్రోలు పాఠశాల విద్యార్థులు ప్రథమ, ఎస్.రాయవరం ద్వితీయ, వాలీబాల్ అండర్-17 విభాగంలో వమ్మవరం ప్రథమ, దార్లపూడి ద్వితీయ స్థానాలు సాధించారు. బాయ్స్ అండర్ 14 విభాగం కబడ్డీలో నారాయణపట్నం విద్యార్థులు ప్రథమ, దార్లపూడి ద్వితీయ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.ప్రసాద్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండల స్థాయి ఆటల పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. బాలికలు 13 పాఠశాల నుండి సుమారు 260 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఏడు క్రీడాంశాలలో డివిజన్ స్థాయికి ఎంపిక చేశామని ఎంఈఓ జి రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శైలజ, గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం డివిఎల్ భవానీ, శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట బాలికల హైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలు శనివారం జరిగాయి. బాలికల ఆటల పోటీలను కూటమి నాయకులు పెదపాటి కల్యాణి, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీను, సర్పంచ్ మంత్రి జయ రజని, తాకాశి కృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఎస్.స్వర్ణకుమారి, పీడీలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే రాజు పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు జన్మదిన వేడుకలు చోడవరం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, గ్రామాల్లో పేదలకు బట్టల పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, ఏడువక లక్ష్మణ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు జి మూలు నాయుడు, సిరిపురం రమేష్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : చోడవరం ఎమ్మెల్యే రాజు పుట్టినరోజు సందర్భంగా శనివారం టిడిపి శ్రేణులు స్థానిక కోపరేటివ్ బ్యాంకు వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు ఎంవివి సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు దొంకెన అప్పలనాయుడు, దొడ్డి కిషోర్, మాజీ జడ్పిటిసి గోకవాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, ముచ్చకర్ల తాతీలు, డిఎస్ నాయుడు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లు ఏర్పాటు

వడ్డాది : ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు జన్మదినం సందర్భంగా శనివారం వడ్డాది పెద్ద బజారు వీధిలో మూడు తాగునీటి బోరులను ఏర్పాటు చేశారు. స్థానిక కూటమి నేత షేక్ రసూల్ ఆధ్వర్యంలో బోర్లను నిర్మిస్తున్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ బోర్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరుకొండ కామలక్ష్మీ సూరప్పారావు, మాజీ సర్పంచ్ తమరాన దాసు, తెలుగు యువత మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పన్ను కట్టిన రసీదులు చూపుతున్న చిరు వ్యాపారులు

పన్నులు మాత్రమే కట్టించుకుంటున్నాం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గాంధీ గ్రామ పంచాయతీ స్థలాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారి నుండి పంచాయతీ పన్నులు మాత్రమే కట్టించుకుంటుందని ఆ గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు తెలిపారు. గాంధీ గ్రామం హైస్కూల్ ప్రహరీ గోడకు ఆనుకొని మెయిన్ రోడ్‌లో సుమారు 60 మంది చిరు వ్యాపారులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని బతుకుతున్నారని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏడాదికి ఒకసారి పంచాయతీ నిబంధనల ప్రకారం ఒక్కొక్కరి వద్ద రూ.3000 చొప్పున పన్ను కట్టించుకుంటున్నామని పేర్కొన్నారు. వారు నేరుగా పంచాయతీ అకౌంట్‌కు నగదు జమ చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ మీటర్ల పేరు చెప్పి ఒక్కొక్క వ్యాపారి వద్ద రూ.3000 తీసుకుంటున్నట్లు కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అది నిజం కాదని వెల్లడించారు. చిరు వ్యాపారి షేక్ రహిమాన్ మాట్లాడుతూ తమ వ్యాపారాలకు విద్యుత్ సౌకర్యం లేనందున పంచాయితీ పన్ను రసీదుతో మీటర్లకు దరఖాస్తు చేసుకోవడానికి తామే నేరుగా పంచాయతీకు పనులు కడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కోలా రమణ, కారు శ్రీను, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

హరిత దీపావళిని ఆచరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : హరిత దీపావళిని ఆచరించాలని కోరుతూ శనివారం మామిడిపాలెం జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీధర్ మాట్లాడుతూ హరిత దీపావళిని పాటించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం విద్యార్థులు నూనె దీపాలను వెలిగించి పూలతో అలంకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయ్, వసంతరావు, సుజాత, కరుణ జ్యోతి, లక్ష్మి, రమణి, సుబ్బలక్ష్మి, సుబ్రహ్మణ్యం,వెంకటేష్, శ్రీను, జగదీశ్వరి, పాల్గొన్నారు.

దేవాలయాలకు ట్రస్టు బోర్డులను నియమించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన దేవస్థానాలకు ట్రస్టు బోర్డులను తక్షణం నియమించాలని ఆర్టీఐ, వినియోగదారుల చట్టాల ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కె.పవన్‌కళ్యాణ్‌లకు 'ఎక్స్' వేదికగా పంపిన వినతిపత్రంలోని వివరాలను శనివారం ఆయన మీడియాకు వివరించారు. తక్షణం ట్రస్టు బోర్డులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

23 నుండి ఉచిత ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 23 నుండి 25వ తేదీ వరకు ఉచిత ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీను శనివారం విలేకరులకు తెలిపారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు, కొత్త ఆధార్ కావలసినవారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గూగుల్ రాకతో అమర్‌నాథ్ ఏడుపు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : విశాఖకు గూగుల్ రావడంతో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఓర్వలేకపోతున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్ వల్ల ఉద్యోగాలు రావని దుష్ప్రచారం మానుకుని ప్రజాహితం వైపు నడవాలని సూచించారు. గూగుల్ రావడంతో జాతీయ, అంతర్జాతీయంగా విశాఖ పేరు మారు మోగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం 16 మాసాల్లో అభివృద్ధి, సంక్షేమంతో పాటు పెట్టుబడిపై దృష్టి సారించిందని పేర్కొన్నారు.

రాజయ్యపేట మత్స్యకారులపై నిర్బంధం ఆపాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మత్స్యకారులపై నిర్బంధం ఆపాలని, ఆ గ్రామం నుండి పోలీసులను వెనక్కి రప్పించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ వద్దని నెల తరబడి మత్స్యకారులు ఆందోళన చేస్తుంటే వారి మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడం కోసం మత్స్యకారుల ఉద్యమంపై ఉక్కుపాదం మోపుతుందని తెలిపారు. ఇప్పటికైనా బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యపై వినూత్న నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:మంచినీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని కొత్తూరు పంచాయతీ గొల్లపేట గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో శనివారం కావిళ్లతో వినూత్నంగా నిరసన చేపట్టారు. గ్రామంలో 45 కుటుంబాలు 125 జనాభా నివాసిస్తున్నారని, మంచినీటి సమస్యతో సతమతమవుతున్నారని వాపోయారు. నర్సీపట్నం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశామని, దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వచ్చి నెల రోజుల్లో మంచి సమస్య పరిష్కారం చేస్తామని చెప్పారని ఇప్పటి వరకు చేయలేదన్నారు. 10వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంక్ నిర్మించారని, ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేశారని అయినా నీటిని అందించలేదని చెప్పారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కారం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మేళం చిన్నరాజబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న సిపిఎం నేతలు, గ్రామస్తులు

బల్క్ డ్రగ్‌ను రద్దు చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి -నక్కపల్లి:బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శనివారం నాటికి 35వ రోజుకు చేరుకుంది. మత్స్యకారులు ప్లకార్డులు చేతపట్టుకొని బల్క్ డ్రగ్ వద్దు -గ్రామం ముద్దు, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి ప్రజలు ప్రాణాలు తీయొద్దని, మత్స్యకారుల పొట్ట కొట్టొద్దని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సముద్రంలో చేపల వేట తప్ప మరే వృత్తి తమకు తెలియదని, సముద్రానికి దూరం చేయొద్దన్నారు. చేపల వేట చేసుకుంటూ కుటుంబాలను పోషించు కుంటూ జీవనం సాగిస్తున్నామని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ నెత్తిన కుంపటి పెట్టొద్దన్నారు. తమ జీవన విధానాన్ని,ఉపాధిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకారులు గోసల సోమేశ్వరరావు, బి బాబ్జి, పిక్కి తాతీలు, కోడ కాశీరావు, రాంబాబు, పిక్కి కోదండరావు, వాసుపల్లి శివ, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

మత్స్యకారుల పోరాటానికి జనసేన అండ

నక్కపల్లి:బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ రాజయ్యపేట మత్స్యకారులు తలపెట్టిన న్యాయ పోరాటానికి జనసేన పార్టీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ అన్నారు. నక్కపల్లి లో పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత రాజయ్యపేట మత్స్యకారుల సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారన్నారు. ఉప్పాడలో మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 100 రోజుల సమయం అడిగిన విషయం తెలిసిందేనని అన్నారు. రాజయ్యపేట మత్స్యకారుల సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని ఆయన మత్స్యకారులను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకేటి గోవిందరావు, గణేష్, అప్పలరాజు, యలమంచిలి చంద్రరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్ రావు

ఘనంగా ఇండక్షన్ మీట్

ప్రజాశక్తి -కోటవురట్ల: మాకవరపాలెం అవంతి కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ నూతన విద్యార్థులతో ఇండక్షన్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కె.వి త్రినాథ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎస్ వి భాస్కరరావు, బిఎస్ఎన్ఎల్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ జీవితంలో సాంకేతిక నైపుణ్యం పట్ల దృష్టి సారించాలని కమ్యూనిటీ స్కిల్స్, స్వీయ నియంత్రణ క్రమశిక్షణ వ్యక్తిత్వం ఎంతో అవసరమని అన్నారు. అనంతరం పలువురు వక్తలు విద్యార్థులకు మార్గదర్శకాలు గురించి తెలియజేశారు అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డానియల్ రాజు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ సేవలు భేష్

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వై వెంకట రమణ స్థాపించిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవలు ఎనలేనివని మండల విద్యాశాఖ అధికారి 2 ఆర్ నాగన్న దొర, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వి బాలాజీ అన్నారు. మండలంలో చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన క్లస్టర్ స్థాయి ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ ఆధ్వర్యంలో హ్యాండ్ రైటింగ్, పద్య పఠనం, రీడింగ్, కథలు చెప్పడం వంటి పోటీలు నిర్వహించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ ఆధ్వర్యంలో సమకూర్చిన బహుమతులను విజేతలకు మండల విద్యాశాఖ అధికారి 2 ఆర్.నాగన్న దొర, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వి.బాలాజీ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ క్లబ్ వ్యవస్థాపకులు వెంకటరమణ మాట్లాడుతూ, విద్యార్థులు ఆంగ్ల భాష పై పట్టు సాధించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వలు పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-నక్కపల్లి:నెల్లూరు జిల్లాలోని సాక్షి కార్యాలయం పై దాడులు అక్రమ కేసులకు నిరసనగా ఏపీడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కోరాడచంద్రరావు, పాయకరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆచంట రామకష్ణ, యూనియన్ ప్రతినిధులు రాము,గోవింద్, డి రాంబాబు, హరి, పెంటయ్య, రమేష్, రాజు, గణేష్, రమణ, సత్యనారాయణ, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న జర్నలిస్టులు

సరుకులు అందజేస్తున్న జనసేన నేత దొరబాబు

బాధిత కుటుంబానికి సరుకుల అందజేత

ప్రజాశక్తి-కోటవురట్ల: మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఉలవపర్తి అప్పయమ్మ ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది, ఈ ప్రమాదంలో దాదాపు రెండు లక్షల వరకు ఆర్థికంగా నష్టపోవడంతో నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు ఎస్ఎస్‌జి దొరబాబు బాధిత కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందచేశారు, ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ నుంచి బాధిత కుటుంబాన్ని ఆదుకునే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు, ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన పార్టీ నాయకులు అద్దేపల్లి గణేష్, సేనాపతి శేషు, కర్రీ సంతోష్ సమ్మిన రమణరాజు, దమ్ము కళ్యాణ్, నర్సింగరావు, పోతల గణేష్, చల్లా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

-ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-మాడుగుల:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకుని విద్యుత్ చార్జీలు ఆదా చేసుకోవాలని శాసనసభ్యులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. శనివారం నియోజకవర్గ కేంద్రం మాడుగులలో విద్యుత్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో వచ్చే సోలార్ రూఫ్టీ ఇళ్ల పై ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఛార్జీలు ఆదా చేసుకోవచ్చునని అన్నారు. ఈ పథకానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే కనిపిస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలని కోరారు. అంతకుముందు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు సన్యాసిరావు, రమేష్, టౌన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసిల్దార్ కే.రమాదేవి, పంచాయతీ కార్యదర్శి నాయుడు, విద్యుత్ శాఖ అధికారులు ఏడి.సురేష్, ఏఈలు కే. రాంబాబు, జి.సోమరాజు, ఎన్. వెంకట్రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోడ గడియారం వితరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక డాన్బాస్కో కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ప్రైవేటు సంస్థలో అకౌంటెంట్గా పని చేస్తున్న యువకుడు ఎస్. జయరాజు తన మొదటి జీతంతో నర్సీపట్నం శాఖా గ్రంథాలయానికి గోడ గడియారంను శనివారం బహూకరించారు. ఈ గడియారాన్ని గ్రంథాలయాధికారి పి. దమయంతికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారితో పాటు యువతీయువకులు, పాఠకులు జయరాజుకు కతజ్ఞతలు తెలియజేశారు.

గడియారాన్ని ఇస్తున్న యువకుడు

నష్ట పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడంపై దళితులు ఆగ్రహం

ప్రజాశక్తి -నక్కపల్లి మండలంలో డిఎల్ పురంలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో భాగంగా సహకరించిన భూములకు పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడం ఏమిటని గ్రామానికి చెందిన దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన స్మశాన్ని వాటిక కు సంబంధించి సుమారు 6 ఎకరాలు, గొల్ల బట్టిల భూమి 12 ఎకరాలు పూర్వం నుండి తమ ఆధీనంలో ఉన్నాయని, కారిడార్ లో భాగంగా ఆ భూములను ఏపీఐఐసీ అధికారులు సేకరించడం జరిగిందన్నారు. పరిహారం కోసం ఇప్పటికే అనేకసార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. కానీ నేటి వరకు పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సేకరించిన భూముల్లో బోరు పనులు చేపడుతున్నారని, నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆహారాన్ని ఇస్తున్న నేతలు

ఘనంగా వేణుగోపాల్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గొలుగొండ:టీడీపీ మండల అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు దిగిమూర్తి సతీష్, 10వ బూత్ కన్వీనర్ వరహాల బాబు, పార్టీ కార్యకర్త రామకృష్ణ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో పాటు పండ్లు, ఫలహారాలు సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నూతిగట్టు అప్పలరాజు, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు రమణ, సతీష్, వాసు, లక్ష్మణ్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్‌తో మేలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి ప్రతి ఇంటిపై సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు నెలల్లో జిల్లాలో 70 వేల యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాల న్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పథకం పట్ల గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు,ఎస్‌హెచ్‌జి మహిళలు ప్రజలలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. యూనిట్ల ఏర్పాటులో సహకరించిన గ్రామ, వార్డు కార్యదర్శులకు వెండర్‌ల ద్వారా ఇన్సెంటివ్ కూడా అందించడం జరుగుతుందన్నారు.ఈ పథకానికి అందరూ అర్హులేనని కలెక్టర్ పేర్కొన్నారు. ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యాంబాబు మాట్లాడుతూ ఒక కిలో వాట్‌కు రూ.65 వేలు ఖర్చు అవుతుందని, రూ.30 వేలు సబ్సిడీ ఉంటుందని, 150 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఇంటిపైన కానీ, ఖాళీ ప్రదేశంలో గానీ 10 /10 అడుగుల స్థలం అవసరం ఉంటుందన్నారు. రెండు కిలోవాట్ల యూనిట్‌కు రూ.లక్షా 25వేల వరకూ ఖర్చు అవుతుందని, ప్రభుత్వం రూ.60 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. 240 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, లబ్ధిదారులు వాడుకోగా మిగిలిన విద్యుత్తును 2 రూపాయల 9 పైసలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుం దని, 6 శాతం వడ్డీకి బ్యాంకు రుణాలు ఇస్తాయని,ప్రజలు ముందుకు వచ్చి దీని వినియోగించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి జివిఎస్ డబ్ల్యూఎస్ జిల్లా అధికారి ఉషారాణి, జోనల్ కమిషనర్లు,తహసీల్దార్లు, ఎంపిడివోలు,యు సి డి అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల పోరాటానికి మద్దతు ఇవ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలకు సంపూర్ణమైన మద్దతు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనువాసరావుకు రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. శనివారం విశాఖపట్నం వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనువాసరావును రాజయ్య పేట బల్క్ డ్రగ్స్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 35 రోజులకు చేరుకున్నాయని ఆయనకు తెలియజేశారు. మత్స్యకారుల చేపట్టిన ఆందోళనకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనువాసరావు మాట్లాడుతూ, మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారుల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకుని భేషజాలకు పోకుండా బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, ఆర్.శంకరరావు జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజేష్, నాయకులు ఎం.మహేష్ బాబు, సోమేష్,మాధవ, వెంకటేష్,కాశీ పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకారులు

మెరైన్ అవుట్ పాల్ టెండర్లు రద్దు చేయాలి

నక్కపల్లి:సిఆర్‌జెడ్ అనుమతి లేకుండా మెరైన్ అవుట్ పాల్ ఎలా వేస్తారని, వెంటనే టెండర్లు రద్దు చేయాలని రాజయ్యపేట మత్స్యకారులు డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో శనివారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ సందీప్ పంచకర్ల, కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముకుందరావులకు వినతిపత్రం అందజేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్‌లకు సమస్యను తీసుకువెళ్లగా, పనులు నిలుపుదల చేస్తామని చెప్పడం జరిగిందని, కానీ బల్క్ డ్రగ్ పార్క్ బల్క్ డ్రగ్ పార్క్ లో ఏర్పాటు చేసే కంపెనీలలో (మెరైన్ అవుట్ పాల్)సముద్రంలోకి వదలడానికి టెండర్లు పిలవడానికి నోటిఫికేషన్ జారీ చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు.ఇది మత్స్యకారులను మోసగించడమే అవుతుందన్నారు. బల్క్ డ్రగ్స్ పోరాట కమిటీ నాయకులు ఎం.అప్పలరాజు, ఎం.రాజేష్, ఎం.మహేష్ బాబు,మాధవ, సోమేష్,కాశీ పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయండి

విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు 'బల్క్ డ్రగ్ పార్కు వద్దు - గంగమ్మ తల్లి ముద్దు' అంటూ 35 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మత్స్యకారులపై పోలీసు నిర్బంధాన్ని అందరూ ఖండించాలన్నారు. బల్క్ డ్రగ్ పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్ వ్యతిరేక పోరాటంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని, ఆ పోరాటాన్ని అణచివేసేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని తెలిపారు. గ్రామంలో నెలల తరబడి సెక్షన్ 30ని అమలు చేసి ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పోరాటానికి మద్దతు తెలుపుతున్న తనను గృహ నిర్బంధం చేస్తున్నారన్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. 1270 ఎకరాల్లో అత్యంత కాలుష్య కారకమైన బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును అందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రజల అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించడం లేదన్నారు. సమస్య పరిష్కారంలో హోం మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అనిత విఫలమయ్యారన్నారు. మత్స్యకారులు రాజయ్యపేటలో చేస్తున్న పోరాటానికి ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు రాజేష్, మహేష్, సోమేష్, కాశి సోమేష్, కాశి వెంకటేష్, కాశి మాధవ రాజు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలి

- తయారీ, విక్రయాలలో జాగ్రత్తలు పాటించాలి
- కలెక్టరు విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : బాణసంచా దుకాణాలకు నిబంధనల మేరకు వెంటనే లైసెన్సులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయం నుండి శనివారం రెవిన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, పంచాయతీ, మునిసిపాలిటీ అధికారులతో బాణాసంచా తయారీ కేంద్రాలు తనిఖీ, తాత్కాలిక విక్రయ దుకాణాలు అనుమతులు, నిబంధనలు అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ లైసెన్సు మంజూరు చేసిన తరువాత దుకాణాలు ఏర్పాటుకు అనుసరించవలసిన నిబంధనలు కఠినంగా అమలు చేసేలా పర్యవేక్షించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతి దుకాణంలో అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాలు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిచోట అంబులెన్స్, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పరిమితికి మించి నిల్వ, అనుమతించిన రోజులకు మించి విక్రయాలు జరుగకుండా చూడాలని సూచించారు. అనుమతులు లేని, నిబంధనలు పాటించని బాణాసంచా తయారీ కేంద్రాలను వెంటనే మూసివేయాలన్నారు. జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి మాట్లాడుతూ విక్రయ దుకాణాలకు దగ్గరగా మండే స్వబావం కలిగిన పదార్థాలు ఉండకూడదన్నారు. జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటులో నిబంధనలు ఖచ్చితంగా పాటించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ వై.సత్యనారాయణరావు, అదనపు ఎస్‌పి మోహనరావు, ఆర్డిఒలు వివి.రమణ, షేక్ ఆయిషా, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్‌వి.రమణ, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, ఎంపిడిఒలు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, ఆర్‌డిఒ తదితరులు

బాణసంచా విక్రయ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ కేంద్రాలను ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం సందర్శించారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, అగ్నిమాపక శాఖ, ఇతర సంబంధిత శాఖాధికారులతో కలిసి మొత్తం 44 షాపుల వద్ద భద్రతా ఏర్పాట్లు, అగ్ని నియంత్రణ పరికరాల లభ్యత వంటి అంశాలను సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ బాణాసంచా విక్రయాలు పూర్తిగా ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా జరగాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ నారాయణ, టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

డైట్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉత్పాదకత పెంపు సాధనాలు (ప్రొడక్టివిటీ ఎన్హాన్స్మెంట్ టూల్స్)పై నిర్వహించిన వర్క్ షాప్ శనివారం ముగిసింది. ఏపీపీఎస్డి ట్రైనర్ జి శిరీష సమయ నిర్వహణ సాధనాలు పని, ప్రాజెక్టు నిర్వహణ సాధనాలు సంవేదన, సహకార సాధనాలు డాక్యుమెంటు, నోట్స్ సాధనాలు ఫైల్స్ నిల్వ, ఆటోమేషన్ సాధనాలు ద్వారా సమయాన్ని ఆదా చేయవచ్చని సూచించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యాభ్యాసం, పరిశ్రమ అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఇటువంటి సెమినార్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపల్ గణేష్ రెడ్డి,వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ కే సుజాత, పాలిటెక్నిక్ కోఆర్డినేటర్ సరిత రాణి, హెడ్ ఆఫ్ సెక్షన్ కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.